

కోరుట్ల రూరల్ : యూసుఫ్‌నగర్‌లో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ శ్రేణులు


గొల్లపల్లి : గొల్లపల్లి మండల కేంద్రంలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మల్లాపూర్: రాఘవపేటలో ప్రధాన కూడలి వద్ద పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# మ్యానిఫెస్టో.. ఆనందహేల

- బీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికపై హర్షాతిరేకాలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సంబురాలు
- ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు
- మూడోసారి కేసీఆరే సీఎం అవుతారని దీవెనలు

అందరికంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, అందరూ ఊహించని విధంగా అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేశారు. అందులో అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూర్చారు. ప్రధానంగా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారు. రైతుబీమా తరహాలో బీపీఎల్ కుటుంబాలకు 'కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికీ ధీమా' పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. ఆసరా పింఛన్లను ₹3,016కు పెంచుతామని, దశలవారీగా ₹5 వేలు చేస్తామని, దివ్యాంగులకు ₹5వేలు, దశలవారీగా ₹6వేలు పెంచుతామని ప్రకటించారు. రైతుబంధు ఎకరాకు ₹12 వేలు ఇస్తామని, దశలవారీగా ₹16 వేలకు పెంచుతామని చెప్పారు. ఇంకా సౌభాగ్య లక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు ₹3 వేల భృతి, అర్హులకు ₹400కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ పరిమితిని పెంచుతామని చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదల కోసం గురుకులాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలు మెచ్చేలా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో విడుదల చేయడంతో సకల జనులు హర్షం వ్యక్తం చేశారు. మేనిఫెస్టో జనం మెచ్చేలా ఉన్నదని, మూడోసారి కేసీఆరే సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబురాలు చేసుకున్నారు. కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూర్, జగిత్యాల, కోరుట్ల, పెద్దపల్లి, గోదావరిఖని, సిరిసిల్లలో పటాకులు కాల్చారు. స్వీట్లు పంచి పెట్టారు. కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేసి కృతజ్ఞతలు తెలిపారు.

-జగిత్యాల, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ)


పెగడపల్లి : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మారుతీనగర్ : మెట్‌పల్లి పాతబస్టాండ్‌లో పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎమ్మెల్సీ కవితతో కోరుట్ల అభ్యర్థి భేటీ



కోరుట్ల, అక్టోబర్ 15: నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆదివారం కలిశారు. నిజామాబాద్‌లోని కవిత నివాసంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్, బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, షకీల్ అహ్మద్, బిగాల గణేశ్ గుప్తతో కలిసి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. పలు అంశాలపై చర్చించారు.

## బీజేపీకి దేశాన్ని పాలించే అర్హత లేదు

- మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎవరి కోటా ఎంతో చెప్పాలి
- ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం


గొల్లపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గజ్జెల కాంతం

గొల్లపల్లి, అక్టోబర్ 15: నాడు బ్రిటీష్ వారికి తొత్తులుగా వ్యవహరించిన ఆర్ఎస్ఎస్, బీజేపీకి దేశాన్ని పాలించే అర్హత లేదని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం మండిపడ్డారు. ఆదివారం గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించారు కదా..? అందులో బీసీ, ఎస్సీ, మైనార్టీల శాతం ఎంతో చెప్పాలని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లలో కేటాయింపులు లేకపోవడం వల్ల లక్ష్యం ఎలా నెరవేరుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో 60 శాతంగా ఉన్న బీసీలకు 58 శాతం రిజర్వేషన్ ఉండాలన్నారు. 22 శాతంగా ఉన్న ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 15నుంచి 17.5 శాతానికి పెంచాలని, మైనార్టీలకు 12 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నవంబర్ 4న కరీంనగర్ అంబేద్కర్ గ్రౌండ్‌లో ప్రజాగర్జన పేరుతో నిర్వహిస్తున్న బహిరంగసభను విజయవంతం చేయడమే లక్ష్యంగా ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పేట భాస్కర్, జిల్లా అధ్యక్షుడు బొనగిరి మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చెవెలమద్ది వినోద్, రాజేశం, హన్మాండ్లు, రాజు పాల్గొన్నారు.

## 'రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పు'

- బీసీలను కించపరుస్తవ
- కథలాపూర్‌లో మున్నూరు కాపుల ఆందోళన


కథలాపూర్ : మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో ఆందోళన చేస్తున్న మున్నూరుకాపు సంఘ సభ్యులు

కథలాపూర్, అక్టోబర్ 15: ''డౌన్..డౌన్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి. బీసీలను అవమానిస్తవా.. నీకెంత ధైర్యం, మున్నూరుకాపు బిడ్డ పొన్నాల లక్ష్మయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేస్తవా.. వెంటనే క్షమాపణలు చెప్పు' అంటూ కథలాపూర్ మండల మున్నురుకాపు సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం కథలాపూర్ మండలకేంద్రంలో ఆందోళన చేశారు. 'రేవంత్ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మున్నూరుకాపు బిడ్డ పొన్నాల లక్ష్మయ్యకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ మున్నురు కాపు సంఘం నాయకులు ఏజీబీ మహేందర్, ముదాం రవి, మంతెన రాజేందర్, తోట చౌదరి, మంతెన రాములు, గాండ్ల చిన్నదేవయ్య, వంచె రాజు, మంతెన శేఖర్, ఇప్ప సురేశ్, ఆకుల ప్రకాశ్, ఇప్ప లచ్చన్న, పోకతోట లింగారెడ్డి, బల్గం తిరుపతి, గంగారెడ్డి, లింగారెడ్డి, తోట రాకేశ్ పాల్గొన్నారు.